క్లుప్తంగా

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న రైల్వే యూనియన్ నాయకులు

రామగుండం: ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం నేషనల్ పెన్షన్ స్కీంకు వ్యతిరేకంగా రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ బ్రాంచి చైర్మన్ మెట్ట రామారావు మాట్లాడుతూ పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ ఓవై.స్వామి, ప్రతినిధులు అరవింద్, మోజెస్, వాణి, వలిహైదర్, ఆనంద్ రాథోడ్ తదితరులున్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత


అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్‌లో ప్రభుత్వభూమిలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని శుక్రవారం మండల తహసీల్దార్ సునీత కూల్చివేయించారు. జీడీనగర్ రైల్వేగేట్ సమీపంలో సర్వేనెంబర్ 561లో 8 ఎకరాల 21 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చర్చి పేరుతో దాదాపు 10 గుంటల విస్తీర్ణంలో అక్రమంగా కట్టడాన్ని నిర్మిస్తుండటంతో మండల తహసీల్దార్ తన సిబ్బందితో వెళ్లి జేసీబీతో కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని స్థానికులను తహసీల్దార్ సునీత హెచ్చరించారు. బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న జీపీ కార్యదర్శులు

ఓదెల: ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి భానుప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ కార్యదర్శుల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినా ఇప్పటివరకూ రెగ్యులర్ చేయలేదని, ప్రాణాలను కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 50 లక్షలు, క్షతగాత్రుల వారికి రూ. 20 లక్షలు చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు సందీప్, శ్రీకాంత్, వెంకటేశ్, నవ్య, అనిత, మీనా, రమేశ్, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు ప్రదానం


అవార్డు అందిస్తున్న మంత్రి కొప్పుల

సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయ కాలనీకి చెందిన చిలుక రాజేశంకు దళితరత్న అవార్డును మంత్రి కొప్పుల ఈశ్వర్ అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్‌డీ అధ్యక్షుడు సురేందర్, రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకరన్న, వ్యవస్థాపక అధ్యక్షుడు భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజన్నకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సన్మానం

సుల్తానాబాద్‌రూరల్: జాతీయస్థాయిలో పెద్దపల్లి జిల్లా గర్రెపల్లి గ్రామానికి జిల్లా ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు అందుకున్న సందర్భంగా శుక్రవారం గౌడ యువజన సమన్వయ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ వీరగోని సుజాత, ఎంపీటీసీ పులి అనూష, కార్యదర్శి ప్రశాంత్‌తో పాటు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ యువజన సంఘ నాయకులు, తదితరులున్నారు.

వైకుంఠధామాల్లో సౌకర్యాలేవి?

- గ్రామాల్లో అసంపూర్తిగా వైకుంఠధామాలు
- అంతిమ సంస్కారానికి అవస్థలు పడుతున్న ప్రజలు
- రెండేళ్లు గడిచినా పూర్తికాని నిర్మాణం
- నిధులు కేటాయించాలని కోరుతున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు


లక్ష్మీపురంలో అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామం

ఫెర్టిలైజర్‌సిటీ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో అన్ని వసతులతో కూడిన వైకుంఠధామాలు నిర్మించాలనే లక్ష్యంతో నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాలో గ్రామాల్లో సుమారు 90 శాతం వరకు వైకుంఠధామం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురంలో వైకుంఠధామం నిర్మాణ పనులు ప్రారంభించి రెండేళ్లయినా నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. శ్మశానవాటికలో స్నానాలు చేసేందుకు నీటికోసం బోర్, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఎదుర్కొంటున్నారు. ఎవరైనా వ్యక్తి చనిపోతే దహన సంస్కారాలకు ఇబ్బందిగా మారింది. కార్పొరేషన్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే నిర్మాణ పనులు జరగడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

గ్రామాలలో కనిపించని వైకుంఠధామాలు

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీపురం, వీర్లపల్లి తదితర గ్రామాల్లో వైకుంఠధామాలు లేవు. గ్రామాల్లో ఎవరైనా చనిపోతే 20 కిలోమీటర్ల దూరంలోని గోదావరినదికి రావాల్సి వస్తోంది. దూర భారంతో పాటు ఖర్చు అధికంగా ఉండడంతో దగ్గరలోని పంటపొలాల్లో దహన సంస్కారాలు కానిస్తున్నారు. ఎఫ్‌సిఐ, సింగరేణి ఖాళీ ప్రదేశాలలో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు.

గ్రామాలకు కేటాయించని నిధులు..

వైకుంఠధామాల నిర్మాణంలో కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలకు శాపంగా మారింది. రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలో వైకుంఠధామాల నిర్మాణం చేపట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం వైకుంఠధామాల నిర్మాణం కోసం గ్రామాలకు నిధులు కేటాయించినప్పటికీ కార్పొరేషన్ పరిధిలోని గ్రామాలకు మాత్రం నిధులు కేటాయించలేదు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని గోదావరి ఒడ్డున హిందూ శ్మశానవాటిక, ఫైవింక్లయిన్ ఏరియాలో ముస్లిం శ్మశానవాటిక, గోదావరిఖని బస్టాండ్ ముందు క్రిస్టియన్ శ్మశానవాటికలు ఉన్నాయి. గోదావరిఖనిలోని డివిజ ప్రజలు మాత్రమే వీటిని ఉపయోగించుకుంటున్నారు. దీంతో కార్పొరేషన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారికి దూరం భారం పెరిగి రాలేక పోతున్నారు. ఇప్పటికైనా వైకుంఠధామాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



లక్ష్మీపురంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వైకుంఠధామం నిర్మాణ పనులు రెండేళ్లయినా ముందుకు కదలడం లేదు.కార్పొరేషన్‌లో ఉండటమే మా గ్రామానికి పాలిట శాపంగా మారింది. అధికారులు స్పందించి లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన శ్మశానవాటికలో కనీస వసతులు కల్పించాలని కోర.కు గదులు నిర్మించేలా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి. – బుర్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు

అధికారులు పట్టించుకోవడం లేదు



వైకుంఠధామాల నిర్మాణాల గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. లక్ష్మీపురంలో వైకుంఠధామాలు నిర్మాణం చేపట్టి వదిలేశారు. దీంతో గ్రామంలో అంత్యక్రియలకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. – మాధవరావు, లక్ష్మీపురం

నిధులు కేటాయించాలి



కార్పొరేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామం వైకుంఠధామానికి నిధులు కేటాయించక పోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. లక్ష్మీపురంలో నిర్మించిన వైకుంఠధామానికి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిధులు కేటాయించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. – నెరేళ్ల ఆశమ్మ, లక్ష్మీపురం

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్

కమాన్‌పూర్: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించడానికే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జెడ్పీ చైర్మన్ పుట్టమధు అన్నారు. మండలంలోని నాగారం, రొంపికుంట, పేరపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. రామగిరి మండలంలోని బేగంపేట, ఆదివారంపేట, నవాబ్‌పేట, నాగేపల్లి, లద్నాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ దాసరి రాయలింగు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీలు రాసకొండ లక్ష్మి, అరెల్లి దేవక్క, జెడ్పీటీసీ మ్యాదర బోయిన శారద, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, వైస్ చైర్మన్ కాపురబోయిన శ్రీదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి పెద్దపీట

మంథని: రైతులను అగ్రభాగాన నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ అన్నారు. మున్సిపాలిటి పరిధిలోని అంగళూరు, పవర్‌హౌస్ కాలనీ,శ్రీ రాంనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పుట్ట శైలజ ప్రారంభించారు. గంగాపురి కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్, లక్కేపూర్‌లో ఎంపీపీ కొండ శంకర్, గుమునూరు సెంటర్‌ను సంఘం డైరెక్టర్ మాచిడి రాజుగౌడ్, గాజులపల్లిలో కొత్త శ్రీనివాస్, మైదుపల్లి కేంద్రాన్ని డెరెక్టర్ కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, సీఈవో అశోక్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీటీసీ మిర్యాల ప్రసాద్‌రావు, కౌన్సిలర్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

గోదావరిఖనిటౌన్: రామగుండం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం 27వ డివిజన్ ప్రభుత్వ బాలుర పాఠశాలకు రూ.5 లక్షల పట్టణ ప్రగతి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చందర్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రామగుండం మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కలువల శిరీష, దొంత శ్రీనివాస్, ఎంవి రమణారెడ్డి, కొమ్ము వేణుగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ నిర్మాణానికి భూమిపూజ

ఖబరస్తాన్ స్థలానికి హద్దులతో కూడిన ఫెన్సింగ్ కావాలనే ముస్లిం సోదరుల విన్నపాన్ని సింగరేణి సీఅండ్ఎండీ అధికారులతో మాట్లాడి ఒప్పించడానికి కృషి చేశామని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం 2 ఏ సమీపంలోని ఖబరిస్తాన్ ఫెన్సింగ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముస్లిం మైనార్టీ సంక్షేమం కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్ అడ్డాల గట్టయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జాహిద్‌పాషా, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం


మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

జూలపల్లి: అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందివ్వడంలో దేశంలోనే తెలంగాణ ఆదర్శమని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అన్నారు. మండలంలోని వడ్కాపూర్, బాలరాజుపల్లె గ్రామాల్లో పార్టీ అధ్యక్షుడు కన్నం రమేశ్ అధ్యక్షతన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రమాదేవి హాజరై మాట్లాడారు. సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు చేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, సర్పంచ్ తిరుపతి, నర్సింహయాదవ్, వైస్ ఎంపీపీ రమేశ్, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కంది చొక్కారెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్,మల్లేశ్ యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీరాజం,నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమపథకాల అమలుపై ప్రచారం చేయాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు పాటుపడదామని మండల పార్టీ అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు అనంతరెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వలలో శుక్రవారం ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. నాయకులు శ్రీనివాస్, రాములు, కొమురయ్య, నర్సింగం, భాస్కర్, రమేశ్, రాజేశం తదితరులున్నారు.

ఆత్మీయ సమ్మేళనాలతో అభివృద్ధిని చాటి చెప్పాలి

ఓదెల: ఆత్మీయ సమ్మేళనాలతో సంక్షేమ పథకాలను చాటి చెబుతామని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సింగిల్‌విండో మాజీచైర్మన్ గోపు నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లె, గోపరపల్లె గ్రామాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు పల్లె ఓదెలు, కర్క మల్లారెడ్డి, ఎంపీటీసీ గోపు లావణ్య, ఎంపీపీ కునారపు రేణుకదేవి, రైతు సమన్వయసమితి మండల అధ్యక్షుడు కావటి రాజు, ఉపసర్పంచ్ ఏనుగుల సదయ్య, నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ కానుక


రంజాన్ కానుకలు అందిస్తున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గంలోని నిరుపేద ముస్లింలకు రంజాన్ పర్వదిన కానుకగా నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 4 వేల కుటుంబాలకు రంజాన్ కానుకలు అందిస్తున్నట్లు తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు


ఇఫ్తార్‌విందులో పాల్గొన్న విజయరమణరావు

ఓదెల:మండలంలోని పొత్కపల్లిలో ముస్లింలకు శుక్రవారం రాత్రి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ ఆళ్ల సుమన్‌రెడ్డి, రెడ్డి రజనీకాంత్, మాజీ ఎంపీపీ గొపగాని సారయ్య గౌడ్, కొంరయ్య, కిట్టు, మస్తత్ పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

సుల్తానాబాద్: పట్టణంలోని ముస్లింలకు శుక్రవారం బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి దాసరి ఉష ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని, బహుజన సమాజ్ పార్టీ అన్ని మతాలను, కులాలను గౌరవిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేష్ పటేల్, మండల ఉపాధ్యక్షుడు కొల్లూరి నర్సయ్య, మండల కార్యదర్శి కేదాసి రమేష్, మండల కోశాధికారి ఆల్లెపు చంద్రశేఖర్,పట్టణ అధ్యక్షుడు తోట మధు పటేల్, ఆషాడపు రాములు, తదితరులు పాల్గొన్నారు

ఎన్ఎస్ఎస్ పీవోలకు శిక్షణ

పెద్దపల్లిరూరల్: వేసవికాలంలో ఎండ తీవ్రత నుంచి తట్టుకునేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన పెంచే విధానంపై జాతీయ సేవా సంస్థ (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం అధికారులకు హైదరాబాద్‌లో ఐదురోజుల పాటు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇచ్చారని పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రోగ్రాం అధికారులు నరహరి, ప్రభాకర్, సదయ్య తెలిపారు.

'భట్టి విక్రమార్క విమర్శలు హాస్యాస్పదం'


మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులు

కాల్వశ్రీరాంపూర్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క బీఆర్ఎస్ ప్రభుత్వంపై, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిపై చేసిన విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ గొడుగు రాజకొమురయ్య యాదవ్ ఖండించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లీక్‌లు, స్కాంలకు పాల్పడినట్లు నిరాధారమైన ఆరోపణలు చేయడం, పెద్దపల్లి నియోజవర్గంలో అభివృద్ధి జరుగలేదనడం హాస్యాస్పద మన్నారు. ఎస్సారెస్పీ కాలువల చివరి భూములకు నీరందించిన ఘనత ఎమ్మెల్యే దాసరికి దక్కిందన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా దాసరి మూడో సారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జిన్న రాంచంద్రా రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ యువత అధ్యక్షుడు కుమార్ యాదవ్, రైతుసమన్వయ సమితి మండల కన్వీనర్ దేవయ్య, ఉప సర్పంచు కరుణాకర్ రావు, నాయకులు కామిడి వెంకట రెడ్డి, ఆడెపు రాజు, జూకంటి అనిల్, తూండ్ల రాజయ్య, బర్ల తిరుపతి, కాసర్ల సాంబారావు, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎస్సారెస్పీ కాలువ హద్దులు గుర్తింపు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ డీ-83 కాలువ భూమి హద్దులను నిర్ధారించిన అధికారులు రాళ్లను పాతించారు. ఎస్సారెస్పీ భూములు అక్రమణ పాలు కాకుండా ఉండేందుకు వీలుగా గుర్తించిన భూమిలో హరితహారం మొక్కలను నాటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాలువ, చెరువుగట్ల వెంట విరివిగా మొక్కలను నాటించేలా ప్రణాళికలను సిద్ధ చేయాలని కలెక్టర్ ఆదేశించిన నేపథ్యంలో ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, ఎస్సారెస్పీ అధికారులు చర్యలు తీసుకున్నారు.

మాలలకు ప్రాధాన్యమివ్వండి

పెద్దపల్లిరూరల్: అన్నిరంగాల్లో మాలలకు ప్రాధాన్యతనిచ్చి ఎదిగేందుకు ప్రభుత్వం తోడ్పాటు నందించాలని మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లాల కనకరాజు అన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రాజ కొమురయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మాలలకు నామినేటెడ్ పదవులు, ప్రభుత్వ పథకాల అములులో ప్రాధాన్యతనివ్వాలని కోరారు. నియోజకవర్గాల్లో రాజకీయ చైతన్యయాత్ర పేరిట గడపగడపకు వెళ్లి చైతన్య పర్చేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. నాయకులు నర్సింగరావు, కృష్ణ, రాజు, మహేందర్, సూర ఉమ, ధర్మేందర్, చందర్, నర్సింగం, లింగన్న తదితరులున్నారు.

అమర జవాన్లకు నివాళి

కమాన్‌పూర్: కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవానులకు మండల కేంద్రంలో శుక్రవారం ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌రెడ్డి, అజయ్. అరుణ్, శ్రీనివాస్, రాము, శంకర్, మల్లేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పాలకుర్తి: మండల పరిధిలోని రాణాపూర్, బసంత్ నగర్, కొత్తపల్లి గ్రామాల్లో కన్నాల సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. రాణాపూర్ కేంద్రాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ ప్రారంభించగా, బసంత్‌నగర్, కొత్తపల్లి గ్రామాల కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ కుడిక్యాల సురేశ్, సర్పంచ్‌లు కట్టికోల వేణుగోపాలరావు, మల్లెత్తుల శ్రీనివాస్, నాయకులు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

ఎల్కలపల్లిలో..

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సింగిల్ విండో చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టబోయిన స్వరూప, ఉప సర్పంచ్ రాజ్ కొమురయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

పెద్దపల్లిరూరల్: అంబేద్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెద్దపల్లి మండలం అప్పన్నపేట పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులను బీజేపీ దళితమోర్చా నాయకులు సత్కరించారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆరోగ్యబీమా కల్పించాలని, వేతనం రూ.19,500 చెల్లించాలని జిల్లా దళితమోర్చా ఇన్‌చార్జీ బాల్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పల్లె సదానందం డిమాండ్ చేశారు. నాయకులు పర్శ సమ్మయ్య, శ్రీనివాస రావు, క్రాంతి, శ్రీనివాస్, సందీప్, పాల్గొన్నారు.

పచ్చర్లకుంట బొంపల్లి మత్స్యకారులదే

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బొంపల్లి, అప్పన్నపేట గ్రామాల మత్స్యకారుల నడుమ పచ్చర్లకుంట విషయమై తలెత్తిన సరిహద్దు వివాదం శుక్రవారం నాటితో సమసిపోయింది. పచ్చర్లకుంట తమదంటే.తమదని కొంతకాలంగా వివాదం సాగుతోంది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా విచారణ జరపాలని తహసీల్దార్, మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. విచారణ జరిపి వారిచ్చిన నివేదిక ఆధారంగా పచ్చర్లకుంట బొంపల్లికి చెందిన మత్స్యకారులే చేపలను పెంచుకోవాలని అధికారులు అనుమతిచ్చారని సర్పంచ్ అరికిల్ల లక్ష్మయ్య తెలిపారు. ఉపసర్పంచ్ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ కొమురేశ్, మత్స్యకారసంఘ నాయకులు కొలిపాక రవి, శంకరయ్య తదితరులున్నారు.

కంటి వెలుగు శిబిరం తనిఖీ

మంథని: ముత్తారం మండలం పోతారంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరం, అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్‌రెడ్డి తనిఖీ చేశారు. కేంద్రాల్లో వసతులు, అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యుడు అమరేందర్, ఎంపీవో వేణుమాధవ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

జూలపల్లి: ప్రతీ ఒక్కరు కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి సంపత్ రెడ్డి సూచించారు. మండలంలోని కోనరావుపేటలో శుక్రవారం 82 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రత్నాకర్, హెచ్‌వీ వసంత, సర్పంచ్ మంగ రవీందర్ రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

న్యూపీకే రామయ్యకాలనీలో కంటి వెలుగు శిబిరం ప్రారంభం

జ్యోతినగర్: కంటి వెలుగు వైద్య శిబిరం శుక్రవారం న్యూపీ.కే.ఆర్ కాలనీలో కార్పొరేటర్ రమణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సుద్దాల గోపాల్, కవితారెడ్డి, ఏఎన్ఎం సుగుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో తీరుపై నిరసన

జూలపల్లి: మహిళా ప్రజాప్రతినిధులను జూలపల్లి ఎంపీడీవో పట్టించుకోవడం లేదని శుక్రవారం మహిళా ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షురాలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నాకు బీజేపీ నాయకుడు ప్రదీప్‌కుమార్ మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాన్ని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంగా మార్చారని, కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండల సమావేశాల్లో మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించక పోవడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొమ్మ ఐలయ్య, మేరుగు కనుకయ్య, బొడిగె లక్ష్మన్, కంచి శ్రీనివాస్,అనిల్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

పాలకుర్తి: జాతీయ పౌర సేవల దినోత్సవం సందర్భంగా పాలకుర్తి మండల తహసీల్దార్ సునీతను శుక్రవారం బసంత్‌నగర్‌కు చెందిన మైనార్టీ యువకులు సన్మానించారు. కార్యక్రమంలో నజీర్ అహ్మద్, నవాబ్‌పాషా, రబ్బాని, అమ్జద్, సల్మాన్, ఆసిఫ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని కొలనూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులుప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.